# అందమైన అబద్ధం

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది !

బోట్స్ క్లబ్ బాల్కనీలో ఓ మూల ఒంటరిగా కూర్చున్న విశ్వనాథం- క్రింద చుట్టూవున్న నీళ్ళల్లోకి చూస్తున్నాడు.

ఆనీళ్ళమీద పడుతున్న వెన్నెల వెండికాంతుల్ని విరజిమ్ముతోంది. దూరంగా టాంక్ బండ్ మీద వరుసగా వెలుగుతున్న కార్పొరేషన్ వారి ఎర్రదీపాలు ప్రకృతి వెన్నెలముందు వెలవెలపోతున్నాయి.

వాటినీ చూసిన విశ్వనాథం పెదవులపై చిన్న చిరునవ్వు మెరుపులా మెరసి అరక్షణంలో మాయమైపోయింది. హఠాత్తుగా అతని స్మృతుల్లో పావని కదిలింది. కళ్ళల్లో కన్నీరు నిలిచింది.

పావని...!

తన ఒక్కగానొక్క కూతురు పావని!... ప్రకృతి వెన్నెల్లా, గంధర్వకన్యలా వుండేది.

కానీ ఇప్పుడు లేదు!

ఇప్పుడు మిగిలినవి జ్ఞాపకాలే!... అలా ఒంటరిగా నిశ్శబ్దంలో కూర్చుని వెన్నెల్లోకి చూసినా– పదిమందిలోనూ ఫణీంద్రను చూసినా- విశ్వనాథానికి పావని గుర్తుకొస్తుంది.

ఫణీంద్ర.... !

తన ప్రాణమిత్రుడు రాజారావ్ కొడుకు!... అందచందాల్లోనూ, చదువూ సంపదల్లోనూ పావనికి తగినవాడు ఫణీంద్ర...

మరి అతన్నికాదని- చలపతిలో ఏంచూసి ప్రేమించిందో పావని! అందుకే ప్రేమ గుడ్డిదన్నారు.

'సార్ !'-

ఆ పిలుపు విశ్వనాథం ఆలోచనలకు అంతరాయం కలిగించింది.

'తమకు ఫోనొచ్చిందిసార్ !'- ఎదురుగా నిలబడివున్న బోయ్ చెప్పాడు.

'కొంపతీసి క్లబ్బుకి రావటంలేదని చెప్పేందుకు రాజారావ్‌గాని ఫోన్‌చేయటంలేదుకదా' అనుకున్నాడు విశ్వనాథం.

# 23

కౌంటర్ దగ్గరకెళ్ళి రిసీవర్ అందుకున్నాడు.

'హలో !'

'నేను డాడీ! సారధిని !'- ఆత్రంగా అడిగాడు విశ్వనాధం.

తన కొడుకును తాను 'నాన్న' అని పిలిస్తే- తన కొడుకు తనను 'డాడీ' అని సంబోధిస్తాడు.

'ఏంలేదు డాడీ!.... మా ఫ్రెండ్స్‌తో సెకండ్‌షోకి వెడుతున్నాను. మీరు క్లబ్బునించి వచ్చాక- నాకోసం కంగారు పడతారేయోననీ.... బైదివే- మీరు భోజనం చేసేయండి'- చెప్పాడు సారధి.

'అలాగే !'- అని అంటూండగానే అవతల్నించి ఫోనుడిస్కనెక్ట్ అయిపోయింది.

'సారథి దారి తప్పటంలేదుకదా ?'— అనుకున్నాడు విశ్వనాధం

ఒక మనిషి పైకిరావాలన్నా— పతనమై పోవాలన్నా ఇదే వయసు ఈ వయసు ఎంత ప్రమాదకరమైనదో తనకు బాగా తెలుసు....! సరిగ్గా ఇదేవయసులో తాను తప్పటడుకు వేయబోయాడు. అదృష్టవశాత్తు తన లోని సంస్కారమేదో వెన్నుతట్టి వెనక్కి పిలిచింది....

సారధి కూడా ఎలాంటి బలహీతనలకూ లొంగిపోడు. తనకా నమ్మకం వుంది. వాడు తన కొడుకు !

ఆలోచిస్తూనే మళ్ళీ ఆరుబయట వెన్నెట్లోకొచ్చి కూర్చున్నాడు.

అంతలో రాజారావు రానేవచ్చాడు.

'రేపు నువ్వు అర్జంటుగా అమలాపురం వెళ్లిరావాల్రా విస్సూ! అన్నాడు వస్తూనే.

'ఏమిటి సంగతి ?'- అడిగాడు విశ్వనాధం.

'మా సుపుత్రుడు ఈ మధ్య ఓ ఘనకార్యం చేశాడు !'- కుర్చీలో కూర్చుని లాల్చీ జేబులోంచి సిగరెట్ కేసూ, లైటరూ తీసి టీపాయ్‌మీద పెడుతూ చెప్పాడు.

అర్ధంకాలేదు విశ్వనాథానికి.

'మరేం లేదురా !-... ఓ అమ్మాయిని లవ్వాడాడు.... ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటానని అల్టిమేటం ఇచ్చాడు.'- అంటూ ఇంకా ఏదోచెప్ప బోతూండగా విశ్వనాధం కల్పించుకుంటూ అన్నాడు-

'ఎవరా పిల్ల ?'

'పేరు సువర్చలట! మా వాడు పనిచేస్తున్న బ్యాంకులోనే ఆపిల్ల కూడా పనిచేస్తోంది.... ఫోటో చూశాన్లే!.... బాగానేవుంది.... అయినా వాడికి నచ్చితే చాలుగా !'

అంతలో బోయ్ రెండు గ్లాసులతో విస్కీ, ఓ ప్లేటులో జీడి పప్పూ తీసుకొచ్చి వాళ్ళముందు పెట్టాడు....

ప్రతిరోజూ క్లబ్బులో ఓ పెగ్గు విస్కీ తీసుకుని గంటసేపు అలా కబుర్లు చెప్పుకుని ఇంటికి వెళ్ళటం వాళ్ళకు అలవాటు.

గ్లాసు ఎత్తి 'చీర్స్' చెప్పాడు రాజారావు.... విశ్వనాధం మాత్రం పరధ్యానంగా ఎటోచూస్తూ వుండిపోయాడు.

'ఏమిట్రా ఆ పరధ్యానం ?... గాసెత్తు !'- హెచ్చరించాడు రాజారావు.

'ఇవాళ నా మనసేం బాగాలేదురా రాజా!'- విస్కీ కొంచెం 'సిప్' చేసి అన్నాడు విశ్వనాధం.

'ఏమైందీ ?'

"పదే పదే పావని గుర్తుకొస్తోంది.... మనసుని కలవర పెడుతోంది!" నాతో జీవితాన్ని పంచుకుని అర్ధాంతరంగా కన్నుమూసిన మా ఆవిడ గురించినేనెప్పుడూ బాధపడలేదుకానీ పావనీఆత్మహత్యచేసు కున్న విషయం గుర్తుకొస్తే చాలు వర్రీ అవుతాను!.... దానికి నేనే బాధ్యుణ్ణా అనే ఆలోచన వస్తే భరించలేకపోతుంటాను!"— కళ్ళల్లోకి ఉబికి వస్తున్న కన్నీళ్ళను దాచుకునే ప్రయత్నంచేస్తూ చెప్పాడు.

"నిజమేరా! ఎన్నోసార్లు ఇదేచోట కూర్చుని అనుకునేవాళ్ళం-మనిద్దరం వియ్యమందాలని....కానీ ఆ అవకాశం లేకుండా పోయిందని నాకూ ఎంతో బాధ కలుగుతూంటుంది...."— నిట్టూర్చాడు రాజారావు.

"పోన్లే ....ఇంతకీ నేను అమలాపురం ఎందుకువెళ్లాలో ఏమిటో పూర్తిగా చెప్పలేదు!"- అడిగాడు విశ్వనాథం టాపిక్ మారుస్తూ.

"అదే! మా ఫణి లవ్వాడిన పిల్ల పేరెంట్స్ అమాలాపురంలో వుంటున్నారు. నువ్వోసారి అక్కడకువెళ్ళి వాళ్ళ మంచి చెడ్డలు తెలుసుకోవాలి!.... వాళ్ళకు ఆస్తిపాస్తులు లేకపోయినా నేను బాధపడను. వాళ్ళనించి నయాపైస కట్నంకూడా నేను ఆశించను....నాకు సంప్రదాయం కావాలి....నా కోడలు ఓ మంచి కుటుంబంలోంచి రావాలనేదే నా కోరిక!"

"నువ్వే ఓసారి అమలాపురం వెళ్లి—ఆ పిల్ల పేరెంట్స్‌ని కలిస్తే బాగుంటుందిగా?" - సలహాఇచ్చాడు విశ్వనాథం.

"లేదురా! అర్జంటు పనిమీద నేను రేపు ఢిల్లీ వెడుతున్నాను. తిరిగి రావటానికి నాలుగయిదు రోజులు పట్టచ్చు! ఈ లోగా నువ్వు వాళ్ళ కుటుంబం మంచి చెడ్డలగురించి తెల్సుకుని ఓకే చేస్తే - నేను

రాగానే ముహూర్తం పెట్టించేస్తాను....పదిరోజుల్లో పెళ్లి జరిగిపోవాలి!.. తర్వాత ఏడాది వరకూ ముహూర్తాలు లేవట.... మా ఆవిడ ఒకటే పోరు పెట్టేస్తోంది " - చెప్పాడు రాజారావు.

"సరే! రేపే వెడతాను.... అక్కడ కాలేజీలో నా ఫ్రెండొకడు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.... అతనిద్వారా వివరాలు సేకరిస్తా.... అన్నట్టు అమ్మాయి పేరెంట్స్ ఎవరో-ఎక్కడ వుంటారో చెప్పలేదు!'

'అమ్మాయి ఫాదర్‌కి ఉద్యోగం గట్రా ఏమీలేవట....మదర్ మాత్రం పెద్ద పేరున్న డాక్టరు!.... పేరు పారిజాతం!

"పారిజాతమా?" ఆశ్చర్యంగా తనలో తనే అనుకున్నా-ఆ మాట రాజారావ్‌కి వినిపించింది.

"ఆవిడ నీకు తెలుసా?" అడిగాడు వెంటనే.

"తెలుసు!.... కానీ నాకు తెలిసిన పారిజాతం, నువ్వు వియ్యమందబోతున్న పారిజాతం ఒక్కరే కాకూడదని కోరుకుంటున్నాను." అంటున్న విశ్వనాథంవైపు రాజారావు వింతగా చూశాడు.

"నీకు తెలిసిన పారిజాతం గురించి నేను తెలుసుకోవచ్చునా?" అడిగాడు క్షణం తర్వాత....

గ్లాసులోవున్న విస్కీని పూర్తిగా తాగేసి - బోయ్‌ని పిలిచి మరో 'పెగ్' ఆర్డరిచ్చి చెప్పటం ప్రారంభించాడు విశ్వనాథం.

".... సుమారు పాతికేళ్ళక్రితం - కంపెనీ పనిమీద ఓసారి నేను విశాఖపట్నం వెళ్లేను.... హోటల్లోమకాం.... ఆరోజు మధ్యాన్నం లంచ్ చేసి రెస్టు తీసుకుంటూండగా - బజర్ మోగింది. వెళ్ళి తలుపు తీసాను.... ఓ ముప్ఫయ్యేళ్ళ యువకుడు లోపలకు వచ్చాడు....

"నా పేరు గోవిందరాజులు గురూగారూ! ఈ ఊళ్లో రెండు మూడు ఏజన్సీలున్నాయి" - అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. నా గురించి కూడా తెలుసుకున్నాడు.

"మంచి పిల్లలున్నారు!.... కావాలా?" అని అడిగేడు.

నేను దిగ్భ్రాంతిగా అతనివైపు చూశాను.... అతని 'ఏజన్సీ' ఏమిటో నాకు అప్పుడు అర్థమైంది.

"నన్ను మరోలా అర్థంచేసుకోకండి గురూగారూ! ఎవరి వ్యాపారం వాళ్లది.... మీకు కావాలంటేనే పంపిస్తాను.... కాలేజీపిల్లలు! కాల్ గరల్స్‌కాదు! కొబ్బరి ముక్కల్లా వుంటారు!" గోవిందరాజులు గడగడా చెప్పేస్తున్నాడు....

"అక్కర్లేదు! నా కలవాటులేదు!" ఏం చెప్పాలో తెలీక-కాసేపు ఆలోచించి ఆఖరికి అలా చెప్పాను.

గోవిందరాజులు పళ్ళన్నీ కనిపించేలా నవ్వేశాడు.

"భలేవారే! ఎప్పుడో ఒకసారి మొదలుపెడితేనేకదా అలవాటయ్యేది?... ఓ అరగంటలో వచ్చేస్తానుండండి!" అంటూ మరి మాట్లాడే అవకాశం నాకు ఇవ్వకుండా వెళ్ళిపోయాడు.

'నిజంగానే తీసుకొస్తాడేమో? అనే ఆలోచన నాలో కలిగేసరికి అరికాళ్ళలో చెమటలు పట్టాయి.

అన్నట్టుగానే - అరగంట తిరిగేసరికి గోవిందరాజులు తిరిగి వచ్చాడు. అతనితో ఓ అమ్మాయికూడా వచ్చింది....అతను చెప్పినట్టు అందంగానేవుంది.

"మీట్ మిస్ పారిజాతం !" - అంటూ ఆమెను నాకు పరిచయం చేశాడు.

"నమస్కారం !" - చిరునవ్వుతో నమస్కరించి, అక్కడే కుర్చీలో కూర్చుందామె.

"నేను మళ్ళీ సాయంత్రం ఆరింటికి వస్తాను !"-అంటూ గోవిందరాజులు నిష్క్రమించాడు.

ఒక్కసారి పారిజాతం వైపు చూశాను.

తెల్లని శరీరానికి ఆమె కట్టుకున్న ఆరెంజ్ కలర్ బట్టలు మరింత శోభను తెచ్చిపెట్టాయి. చీరకూ జాకెట్టుకూ మధ్య సన్నని నడుంమీద చిన్న ముడతపడి అదోరకం అందాన్ని చేకూరుస్తోంది.

'మీదేవూరు !' అడిగాను.

'అమలాపురం! .. ఇక్కడే హాస్టల్లోవుండి చదువుకుంటున్నాను.... మెడిసిన్ ఫోర్తియర్ !... ఇలా ఆదివారం వచ్చిందంటే, సినీమాకీ. బీచ్‌కీ వెళ్ళొస్తామంటే మా వార్డెన్ పర్మిషన్ ఇస్తుంది. మళ్లీ చీకటి పడేవేళకు గూటికి చేరుకోవాలి !'- చలాకీగా మాట్లాడింది పారిజాతం... ఆతర్వాత నాచదువు గురించీ. నేను చేస్తున్న ఉద్యోగం గురించీ, వచ్చే జీతం గురించీ అడిగింది....

'ఎంతేమిటి నీ ఫీజు ?'

'రెండువందలు !'

'చాలా ఎక్కువ !'

'ఇంకా ఎక్కువ ఇచ్చేవాళ్లు కూడా వుంటారు.... కానీ నేను ఫిక్స్ చేసుకున్న రేటు మాత్రం అది!... అందులో గోవిందరాజులుకి ఏభై ఇవ్వాలి!'- చెప్పింది పారిజాతం.

'ఇలాంటి చెడు తిరుగుళ్లు తిరిగితే నీ ఆరోగ్యం చెడిపోదూ?... ఆ తర్వాత పెళ్ళెవరు చేసుకుంటారు?'- ఏదో అడగబోయి ఏదో అడిగేశానేమో అనిపించింది- అడిగిం తర్వాత.

నా ప్రశ్నకు ఆమె గలగలా నవ్వేసింది.

'ఇవి చెడు తిరుగుళ్లు ఎందుకవుతాయి?... మనిషికి మానసికంగా ఆనందం, తృప్తీకావాలి!... వాటికోసం ఈ పనిచేస్తే తప్పేముంది?... అయినా కాబోయే డాక్టర్ని!... ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో నాకు బాగా తెలుసు!'

'ఇలా సంపాదించే డబ్బుతో- అయామీన్- పాపిష్టిడబ్బుతో చదివే చదువుకి సార్ధకత వుంటుందనుకుంటున్నావా!'- తీవ్రంగానే అడిగాడు.

పారిజాతానికి కోపం వచ్చినట్టుంది.... అయినా తమాయించు కుంటూ చెప్పింది-

'మహావస్తే- నెలకు అయిదారు వందలువస్తాయి... అవికాస్తా నా టాయిలెట్ సామాన్లకు సరిపోతాయేమో.... అంతే!... చదువుకి నెలనెలా మావాళ్లు డబ్బు పంపిస్తూంటారు!'

'అంటే... ఈ డబ్బు చదువుకునేందుకు కాదన్నమాట!'-

తను చాలా బీద కుటుంబంనించి వచ్చిందనీ, తనే తన వాళ్ళకు ఆధారమనీ- చదువుకునేటందుకు డబ్బు అవసరమై, మరో గత్యంతరం

లేక ఈ పాడుపనికి తలపడ్డాననీ ఆమె చెప్పివుంటే నాకు సంతృప్తి కలిగేదేమో!... కానీ ఆమె మాటలు విన్న తర్వాత నాకెందుకో ఆమెపై అసహ్యం, జుగుప్సకలిగాయి.

వెంటనే జేబులోంచి ఓ వందకాగితం తీసి ఆమె మీదకు విసిరేశాను.

'ఇంకవెళ్ళచ్చు!'

ఆ హఠాత్ పరిణామానికి పారిజాతం, ముందు త్రుళ్ళిపడినా-తరువాత నెమ్మదిగా చెప్పింది.

'మీదగ్గర డబ్బు ఎక్కువగావుంటే లేనివాళ్ళకు దానంచేసుకోండి! నేను మాత్రం 'ఉత్తినే' డబ్బు తీసుకునే దాన్ని కాను... గోవిందరాజులకి మాత్రం ఏభై ఇవ్వండి!.... అతనొస్తే నేను హాస్టల్‌కి వెళ్ళిపోయానని చెప్పండి అంటూ చివాల్న లేచివెళ్ళిపోయింది పారిజాతం....

ఆరుగంటలవుతూండగా గోవిందరాజులు వచ్చాడు. జరిగింది తెల్సుకుని నన్ను ఓ పురుగుని చూసినట్టుగా చూసి అన్నాడు.

'మీరు చాలా అమాయకులు గురూ గారూ! అయినా మీరు కాకపోతే మరెవరూ దొరకరా? వెరైటీ కోరుకోని మొగాడెవరు సార్ ఈ లోకంలో?... ఆపారిజాతం మీదఇప్పటికప్పుడే- ఇలా ఏభై రూపాయల చొప్పున- నాలుగువేలుపైగా సంపాదించాను, దాన్నిబట్టి మీరే ఆలోచించండి... మన సమాజం ఎటుపోతుందో?.... అయినా అనుభవించటానికి కూడా అదృష్టంవుండాలి గురూగారూ!'- అంటూ నేనిచ్చిన ఏభై నోటు జేబులో కుక్కుకుంటూ బయటకు నడిచాడు గోవిందరాజులు.

'ఆగు!' గట్టిగా అరిచాను-

అతను ఆగిపోయి నా వైపు చూశాడు.

'నువ్వెప్పుడైనా జీవితాన్ని అనుభవించావా ?.... అదే.... అంటే నా ఉద్దేశ్యం పారిజాతాన్ని..' నేను పూర్తిగా అడక్కుండానే నా మనసులో మాట గ్రహించేసిన గోవిందరాజులు వెకిలిగా నవ్వుతూ మళ్ళీ నాముందుకొచ్చాడు...

'ఓ యస్ గురువుగారూ! ఒక్క పారిజాతమే కాదు... సుజాత, కామేశ్వరి, కనకవల్లి ఇంకా ఎందరో!' గోవిందరాజులు అలానవ్వుతూ చెప్తూంటే ఆ ప్రశ్న ఎందుకు అడిగానా అనిపించింది... అతను వెళ్లిపోయాక, కొండంత బరువు దిగిపోయినట్టుగా ఫీలయి, హాయిగా స్నానం చేశాను'...

'అదే నాకు తెలిసిన పారిజాతంకథ!- అంటూచెప్పటం ముగించి రాజారావ్ వైపు చూశాడు విశ్వనాధం....

'బహుశా ఆ పారిజాతమే ఈ పారిజాతం కాదుకదా!'- అనుమానాన్ని వ్యక్తం చేశాడు రాజారావు.

'నో! అలాకావటానికి వీలులేదు!... అవకాశం కూడాలేదు!' మనసులో సందేహంపీడిస్తున్నా, అతనికి ధైర్యంచెప్పాలని ప్రయత్నించాడు విశ్వనాధం.

'కాకూడదనే అనుకుందాం! అయినా నువ్ రేపే అమలాపురం వెళ్ళిచూసిరావాలి! ఒకవేళ ఆ పారిజాతమే ఈవిడయితే, ఆసంబంధాన్ని వదిలేసుకుందాం... ఫణీంద్రకు ఎలాగో నచ్చచెప్తాను! అలాంటిదాని కూతురు నా యింటి కోడలుగా రావటం నేను భరించలేను... ప్లీజ్... నువ్ రేపేవెళ్ళిరా!'- అర్థింపుగా అన్నాడు రాజారావు.

ఆమర్నాడే విశ్వనాథం అమలాపురం వెళ్ళివచ్చాడు.... ఆతర్వాత నాలుగురోజులకు రాజారావుకూడా ఢిల్లీనించి తిరిగివచ్చాడు.

'పారిజాతాన్ని చూశావా!'- రాగానే, విశ్వనాధాన్ని ఫోన్లోనే అడిగాడు ఆత్రంగా-

'చూశాన్లే... ఆపారిజాతం, ఈవిడా ఒక్కరే కాక పోవచ్చునని అనాడే చెప్పానుగా!... అన్ని వివరాలూ సేకరించాను... మంచి సంప్రదాయం కలిగిన కుటుంబం!... నువ్ ఆలస్యం చేయకుండా ముహూర్తం పెట్టించచ్చు!'- చెప్పాడు విశ్వనాథం.

పదిరోజులు తిరక్కుండా పారిజాతం కూతురు సువర్చలకూ రాజారావ్ కొడుకు ఫణీంద్రకూ- వైభవోపేతంగా పెళ్లి జరిగిపోయింది.

పెళ్ళి పందిట్లో విశ్వనాధాన్ని చూసిన సువర్చల తల్లి, డాక్టర్ పారిజాతం గతాన్ని గుర్తుచేసుకోటానికి ప్రయత్నిస్తూ-

'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం!'— అన్నది.

'ఏమో... చూశారేమో!..., కానీ నాకు మాత్రం మిమ్మలెప్పుడూ చూసినట్టు గుర్తులేదు!'— అతిమామూలు ధోరణిలో.

ఆ తర్వాత మనసులోనే అనుకున్నాడు.

'వెయ్యి అబద్ధాలాడైనా ఓపెళ్ళి చెయ్యమన్నారు... ఒకే ఒక అందమైన అబద్ధం చెప్పి- ఓ పెళ్ళి ఆగిపోకుండా చూశాను!... నేనే కనుక నిజం చెప్పివుంటే, ఈ సువర్చల కూడా నాపావనిలాగే, తాను ప్రేమించిన వ్యక్తిని పొందలేక ఆత్మహత్య చేసుకునేదేమో! అసలు పెద్దవాళ్ళు చేసే తప్పులకు పిల్లలు శిక్ష అనుభవించకూడదు!'

* * *